ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 4 జనవరి 2025 | 5



మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

మంత్రి అచ్చెన్నాయుడు

7లో

మత్స్యకారులకు నష్టపరిహారం అందజేత

నేడు అమలాపురంలో ముత్యాల ముగ్గుల పోటీ

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ ఆధ్వర్యంలో నిర్వహణ



అమలాపురం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీ జరగనుంది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ సంయుక్త ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్ .. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేతృత్వంలో ఈ పోటీలు జరుగుతాయి. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగే ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొనే మహిళలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలతో పాటు కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేయనున్నారు. ముగ్గుల పోటీకి నేరుగా మహిళలు హాజరు కావచ్చు. ఎవరి ముగ్గు వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గుకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

నేడు పి.గన్నవరంలో నిర్వహణ

జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

పి.గన్నవరం, జనవరి3(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సలీంబాషా సూచించారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిమిత్తం పి.గన్నవరం హైస్కూల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అనంతరం ప్రధానోపాధ్యాయుడు డీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లా సైన్సు ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాసైన్స్ అధికారి టీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి 17 కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 110 ప్రాజెక్టులు ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యక్తిగత విభాగం, గ్రూపు విభాగాల నుంచి ఒక్కో విభాగం నుంచి రెండు ప్రాజెక్టుల వంతున మొత్తం 6 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. రీజనల్ స్థాయి పోటీలను ఈ నెల 21, 22, 23 తేదీల్లో పుదుచ్చేరిలో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. రీజనల్ స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు పోటీపడతాయని ఆయన వివరించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అకడమిక్ అధికారి పి.రాంబాబు, ఏపీవో ఎంవీకే భీమారావు, ఎం ఈవోలు కె.హెలీనా, సీహెచ్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణానికి తూట్లు పొడుస్తూ 15 అడుగుల లోతులో తవ్వకాలు



జొన్నాడ ర్యాంపులో ఇసుక లూటీ..

- ప్రభుత్వ పనుల పేరుతో ఇసుక దోపిడీ
- వందలాది ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు
- కాసులు కురిపిస్తున్న వ్యాపారం
- ఉచిత ఇసుక పథకానికి తూట్లు
- అంతా కూటమి నాయకుల కనుసన్నల్లోనే...

తెగ తవ్వేస్తున్నారు..



అనధికార స్టాక్ పాయింట్‌లో ఇసుక

ఆలమూరు/(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపులో ఇసుక లూటీ యథేచ్ఛగా జరుగుతోంది. ఇక్కడ ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. కేవలం ప్రభుత్వ అభివృద్ధి పనులకు, గృహ నిర్మాణ శాఖ ద్వారా అనుమతి పొందిన ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక తీసుకెళ్లడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. ఇప్పుడు ఈ 'అనుమతే' కూటమి నాయకులకు కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వ అవసరాలకు, పేదల ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నామనే ముసుగులో పెద్ద ఎత్తున ఇసుక కొండలను పిండి చేస్తున్నారు. పది శాతం మాత్రమే ప్రభుత్వ భవనాలకు, పేదల ఇళ్లకు ఇసుక సరఫరా అవుతుండగా 90 శాతం పక్కదారి పడుతోంది. ఈ ముసుగులో ట్రాక్టర్లకు ట్రాక్టర్లు తరలించుకుపోతున్నారు.

స్థానిక అవసరాలకే అనుమతి

స్థానిక అవసరాల కోసం మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చాం. పంచాయతీల ద్వారా అనుమతి తీసుకున్న వారికి మాత్రమే ఇసుక ఇవ్వాలని నిబంధన పెట్టాం. అయితే నిబంధనలు పాటించడంలేదని వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణం తవ్వకాలు నిలుపుదల చేస్తాం. -కెజె.ప్రకాష్‌బాబు, తహశీల్దార్

ఉచిత ఇసుక పేరుతో..



ఉచిత ఇసుక పేరుతో ఇసుకను తరలిస్తూ అధిక మొత్తంలో డబ్బులు గుంజుకుంటున్నారు. ట్రాక్టర్‌కు రూ.600 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు పొందిన ర్యాంపులో బాట నిర్వహణ, లోడింగ్ నిమిత్తం రూ.300 వసూళ్లు చేస్తుంటే ఇక్కడ కూటమి నాయకులు ట్యాక్స్‌తో కలుపుకుని రూ.600 వసూళ్లు చేస్తున్నారు. ఇదేమని ఎవరైనా అడిగితే మీకు సమాధానం చెప్పవలసిన పనిలేదని చెబుతున్నారని పలువురు వాహనదారులు వాపోతున్నారు.





బండెనక..బండికట్టి..జొన్నాడ ర్యాంపులో ఇసుక తరలింపు

స్టాక్ పాయింట్ల దందా



జొన్నాడలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను నేరుగా స్టాక్ పాయింట్‌లకు తరలించి అక్కడ నుంచి నేరుగా లారీలలో అమ్మకాలు చేయడానికి జొన్నాడలో ఏడు నుంచి ఎనిమిది వరకు స్టాక్‌పాయింట్లు వెలిశాయి. అయితే కూటమి నాయకుల కాస్త ఒక అడుగు ముందుకెళ్లి ఏకంగా ర్యాంపులోనే స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని ఉచితం పేరుతో నేరుగా ఇసుకను తరలించుకుపోతున్నారు. మొదట్లో రాత్రి సమయంలో స్టాక్ పాయింట్ నుంచి ఇసుక తరలిస్తే ఇప్పుడు ఏకంగా పగటి పూటే లారీలకు లోడు చేసి నేరుగా తరలిస్తున్నారు. ర్యాంపులో ఇసుక తీసుకోవడానికి ఇళ్ల నిర్మాణదారులు సచివాలయంలో అనుమతి తీసుకోవాలి కానీ నాయకులు మాత్రం ఎక్కడా అనుమతి తీసుకోవాల్సిన పనిలేదు. ఎటువంటి నిబంధనలు వారికి వర్తించవు.

నిబంధనలు బేఖాతరు

ఈ అక్రమ ఇసుక తవ్వకాలలో కూడా కూటమి నాయకులు ట్రాక్టర్లకు ప్రత్యేక లైన్‌ను ఏర్పాటు చేశారు. వారికి సంబంధించిన ట్రాక్టర్లు ఏమీ కూడా అన్ని ట్రాక్టర్లతో పాటు లైన్‌లో ఉండాల్సిన అవసరం లేదు. ర్యాంపునకు ఎప్పుడు వస్తే అప్పుడు నేరుగా స్టాక్ పాయింట్‌కు వెళ్లి ఇసుకను పట్టుకుపోతున్నారు. వారు కావాల్సిన రేటుకు ఇసుకను అమ్మేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. నిబంధనలు గాల్లో కలిసిపోతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



మండపేటలో రేవ్‌పార్టీ..

మెయిన్‌లో..

డిసెంబరు 31 రాత్రి మందు, చిందు..

హిజ్రాల దుస్తులు విప్పించి డ్యాన్సులు



సముద్రంలో అలవోకగా..

6లో

- వైజాగ్ నుంచి కాకినాడకు ఈదుకుంటూ..
- అవలీలగా ఆరు రోజుల్లో 150 కిలోమీటర్ల ఈత
- మహిళా స్విమ్మర్ గోలి శ్యామలకు ఘనస్వాగతం

నేటి నుంచి ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి వనుము సోమశేఖరరావు



అమలాపురం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' పేరుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. దీని కోసం గత 15 రోజుల నుంచి ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఇప్పటికే జిల్లాలో ఉన్న 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు భోజనం చేయడానికి గిన్నెలు, గ్లాసులు, వంట పదార్థాలు తెచ్చుకునేందుకు హాట్‌ప్యాక్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కొనుగోలు చేశారన్నారు. ప్రతీ కళాశాలకు సమీపంలో గల ఉన్నత పాఠశాలలను భోజనం కోసం జత చేశామన్నారు. అక్కడి నుంచి ఆటో ద్వారా కళాశాలకు ఆహార పదార్థాలు తీసుకువస్తారన్నారు. జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. 2414 మంది జనరల్, ఒకేషనల్, ఇంటర్మీడియట్ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారిలో 1382 మంది ప్రథమ సంవత్సరం, 1132 మంది ద్వితీయ సంవత్సరం చదువుతున్నారన్నారు. ఈ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖాధికారి సూచించారు.

జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ తనిఖీలు



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మండపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ స్థలాలను విజిలెన్స్ రెవెన్యూ విభాగానికి సంబంధించిన అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. రాజమహేంద్రవరం విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారుల బృందం మండపేట మండలం కేశవరం, ద్వారపూడి, వేములపల్లి, కపిలేశ్వరపురం మండలాల్లో జగనన్న లేఅవుట్ స్థలాలను పరిశీలించింది. ఆయా లేఅవుట్‌లకు సంబంధించి మెరక చేసిన భూముల వివరాలు, ఎంతమేర భూమి లబ్ధిదారులకు అంది ంచారు అనే అంశాలపై అధికారులు ఆరా తీశారు. మండపేట మండలంలో పర్యటించిన విజిలెన్స్ అధికారులు వెంట స్థానిక రెవెన్యూ అధికారులు ఉన్నారు.



ఎస్పీ కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

అంతర్వేదిలో ఎస్పీ పూజలు

అంతర్వేది, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం విచ్చేశారు..ఆయనకు ఆలయ ఏసీ సత్యనారాయణ, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులచే మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఎస్పీకి అందజేశారు.

'హైందవ శంఖారావానికి తరలిరావాలి'

అమలాపురం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శనివారం నిర్వహించనున్న హైందవ శంఖారావానికి భారీ సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. ఈ శంఖారావంలో సాధువులు, మఠాధిపతులు తమ సందేశాలు ఇస్తారని వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్, అఖిల భారత సంఘటన ప్రధాన కార్యదర్శి మిలింద్ పారండే, అఖిల భారత సంయుక్త కార్యదర్శి కోటేశ్వరశర్మ, శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవింద దేవ్ గిరిమహరాజ్ పాల్గొంటారన్నారు. ఆలయాల పరిరక్షణ, దేవావాలయ భూముల సంరక్షణ తదితర వాటిని శంఖారావంలో చర్చిస్తారని తెలిపారు. ఈ సభకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.







ఆర్గానిక్‌లో అద్భుతాలు..

ప్రకృతి వ్యవసాయంలో సాగుపోతున్న రాంబాబు

క్రిమి సంహారక ఎరువులు, పురుగు మందుల మధ్య పుట్టుకొస్తున్న 'ఆహారం' అనారోగ్యాన్ని తెచ్చిపెడుతోంది. మందులు చల్లిన ఆహార ఉత్పత్తులకు అలవాటు పడ్డ మనిషి కొత్త కొత్త రోగాలను కొనితెచ్చుకుంటున్నాడు. ప్రస్తుతం అంతా స్పీడ్ సాగు..దీంతో అంతే స్పీడుతో ఆరోగ్య సమస్యలు కూడా వచ్చి పడుతున్నాయి. విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీతో అధిక దిగుబడులు సాధించడం తప్ప, నాణ్యమైన దిగుబడులు మాత్రం సాధించలేకపోతున్నారు. అయితే యువ రైతు ప్రగడ రాంబాబు ఆ రూటు ఎంచుకోలేదు..ప్రకృతి వ్యవసాయమే ఊపిరిగా సాగుతున్నాడు.

● రాజానగరం/(ఆంధ్రజ్యోతి)

- ప్రకృతి వ్యవసాయ సాగులో ఆరితేరిన యువ రైతు ప్రగడ రాంబాబు
- క్లాప్ బీన్స్ సాగు భలే బాగు
- మిశ్రమ కూరగాయల సాగులో మేటిగా రాణింపు
- 'మార్కెటింగ్' తెలిసిన రైతుగా పేరు



పొట్టి పొట్ల కాయలు

ప్రకృతి సాగే ఊపిరిగా..

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన రాంబాబు దశాబ్ద కాలంగా ప్రకృతి వ్యవసాయ సాగులో ఆరితేరాడు.. ఆర్గానిక్ సాగు విధానంలో అనేక రకాలైన కూరగాయలతో పాటు వరి పంటను పండిస్తూ వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. గ్రామంలో గత పదేళ్లుగా నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రాంబాబు 'పంట' ప్రయోగాలు చేస్తున్నాడు. ప్రకృతి సాగు విధానంలో మిశ్రమ కూరగాయల సాగులో రాణిస్తున్నాడు. తేలికపాటి నేలల్లో లవంగ, చిక్కుడు సాగు భలే బాగుంటుందని నిరూపిస్తున్నాడు.

శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

యువ రైతు రాంబాబు చేసే ప్రకృతి సాగు వ్యవసాయ విధానాన్ని అనేక రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు అనేక పర్యాయాలు క్షేత్ర సందర్శన చేశారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన 25 మంది రైతుల బృందం క్షేత్ర సందర్శన చేసింది. అలాగే మహారాష్ట్ర నుంచి వ్యవసాయాధికారులు అక్కడి రైతులతో కలిసి సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలోని వ్యవసాయాధికారులు, రైతులు అనేక పర్యాయాలు పర్యటించారు.



యువ రైతు రాంబాబు

ప్రభుత్వం సహకరించాలి

ప్రకృతి వ్యవసాయంలో మార్కెటింగ్ సమస్య రైతులను వెంటాడుతోంది. ఖర్చులు ఎక్కువ, దిగుబడి తక్కువ. ప్రభుత్వం మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలి. లేదంటే నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేయాలి, లేనిపక్షంలో కనీసం హబ్‌లు ఏర్పాటు చేయాలి. సాగు విధానంలో మార్కెటింగ్ సదుపాయాలు తక్కువ, ఖర్చులు ఎక్కువ ఉంటున్నాయి. ప్రకృతి వ్యవసాయంలో సుభాష్ పాలేకర్ విధానంతో పాటుగా సోహాన్‌క్యూ, సీవీఆర్, సస్యరక్షణ శిలీంద్ర విధానాలను అవలంబిస్తున్నట్లు రాంబాబు వివరించాడు..

క్లాప్ బీన్స్ (లవంగ చిక్కుడు)..

క్లాప్ బీన్స్ అనేది తీగ జాతికి చెందిన పాలు కారే మొక్క విత్తనాలు కేరళ నుంచి కిలో రూ.2 వేలు వంతున కొనుగోలు చేశారు. విత్తనం నాటిన 5 రోజులకు మొక్కలు పుట్టుకొచ్చి, 50 రోజులకు కాపు దశకు చేరుకుంటుంది. ఆకులు తమల పాకులను పోలి, పూలు తూటి పువ్వులు మాదిరిగా ఉంటాయి. ప్రస్తుతం రెండు ఎకరాల్లో క్లాప్ బీన్స్ సాగులో ఉంది. ప్రస్తుతం కిలో రూ.100 వరకు ధర ఉంది.

క్లాప్ బీన్స్ గుణగణాలు

క్లాప్ బీన్స్ పూర్తి శీతాకాల పంట. సాగులో తెగుళ్లు, చీడ పీడలను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తుంది. అలాగే నిల్వ సామర్థ్యం కూడా దీని సొంతం. వర్షాకాలంలో వచ్చే ఆకాకర సాగు తర్వాత క్లాప్ బీన్స్ పూర్తి శీతాకాలపు సాగుగా చెప్పొచ్చు. క్లాప్ బీన్స్‌లో పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి.



లవంగ చిక్కుడు ఎగుమతికి సిద్ధం

వివిధ రకాల సాగు

రాంబాబు తన నాలుగు ఎకరాల పొలంలో స్నేక్ గార్డ్ (పిచ్చుక పొట్ల కాయ), గ్రీన్ సొరకాయ, చిత్రాడ బీర, కూర దోస, గ్రీన్ పిచ్చుక పొట్లకాయ, గ్రీన్ దేశవాళి కీరదోస, వైట్ దేశవాళి కీరదోస, దేశవాళి పొడవు కీరా, ఆనబకాయ, బొబ్బర్లు (లాంగ్ వెరైటీ), బీర, దొండ, కాకర, మిర్చి తదితర పంటను సాగు చేశాడు. ప్రస్తుతం క్లాప్ బీన్స్ (లవంగ చిక్కుడు)తో పాటుగా తమ్మ చిక్కుడు, కూర బొబ్బర్లు (పొడవు), వెల్‌వెట్ బీన్స్ మామిడి అల్లం, పసుపు, దొండ, బొప్పాయి, మిర్చి, టమాట వంటి రకాలు సాగులో ఉన్నాయి. ఏడాది కాలంలో మూడు పంటలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని మార్చి నెలలో శ్రీకారం చుట్టి ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తాడు. ప్రతి రెండేళ్లకోసారి పంట మార్పిడిలో వరి, మినుము, పచ్చిరొట్ట ఎరువులు సాగు చేస్తాడు. వీటిలో ప్రధానంగా రెండు పంటలు కూరగాయలు సాగు ఉంటుందని అతను చెబుతున్నాడు..

సముద్రంలో అలవోకగా..

- వైజాగ్ నుంచి కాకినాడకు ఈదుకుంటూ..
- అవలీలగా ఆరు రోజుల్లో 150 కిలోమీటర్ల ఈత
- దేశంలోనే తొలి మహిళా స్విమ్మర్‌గా రికార్డు
- మహిళా స్విమ్మర్ గోలి శ్యామలకు ఘనస్వాగతం



సముద్రంలో జాతీయ పతాకంతో స్విమ్మర్ శ్యామల

సర్పవరంజంక్షన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సువిశాల సముద్రం.. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలు. సముద్రంలో జెల్లీ ఫిష్‌లు వెంటపడి కొరుకుతున్నా.. భయంకరమైన వేల్ ఫిష్ దాడికి ప్రయత్నించినా సప్త సముద్రం, బంగాళాఖాతంలో 150కిలోమీటర్ల మేర సముద్రంలో ఈత లక్ష్యాన్ని పూర్తిచేయాలన్న సంకల్పం ముందు అవరోధాలు ఏమీ కానరాలేదు. కేవలం 6 రోజుల్లో రోజుకు 20-30కిలోమీటర్లు సముద్రంలో ఈత కొట్టి వైజాగ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు సముద్రంలో 150 కిలోమీటర్ల లక్ష్యాన్ని అవలీలగా ఈదేసి అరుదైన రికార్డును సొంతంచేసుకున్నారామె. ఆమె కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52ఏళ్ల మహిళా స్విమ్మర్ గోలి శ్యామల.

యానిమేషన్ సినిమాల నిర్మాత, దర్శకురాలిగా, రచయితగా, పలు బిజినెస్‌లు చేసి నష్టపోయి డిప్రెషన్‌కు లోనై కోమాలోకి కూడా వెళ్లిన ఆమె ఇప్పుడు అంతర్జాతీయ వాటర్ స్విమ్మర్‌గా రికార్డులను తనపేరున లిఖించుకున్నారు.మహిళల ఆరోగ్య, మానసిక సమస్యలనుంచి ఆరోగ్యంగా ఉండేలా, పర్యాటకరంగం అభివృద్ధి కోసం శ్యామల విశాఖ ఆర్కే బీచ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌వరకు 150కిలోమీటర్లు సముద్రంలో ఈత ఈది రికార్డు సృష్టించాలని నిర్ణయించుకుంది. డిసెంబరు 28న విశాఖ ఆర్కే బీచ్‌లో ఎంపీ భరత్ సముద్రంలో సాహస యాత్రకు జెండా ఊపి ప్రారంభించారు. విశాఖతీరంనుంచి సముద్రంలో ఈత ఈదుకుంటూ శుక్రవారం జనవరి 3న కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అవలీలగా లక్ష్యాన్ని చేరుకున్నారు. సుదీర్ఘ సముద్రంలో 150కిలోమీటర్లు ఈత ఈదిన తొలి ఆసియా స్విమ్మర్‌గా శ్యామల అరుదైన రికార్డు సాధించారు. ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకున్న ఆమెకు కోరమండల్ ఒడిస్సీ ఓషియన్ స్విమ్మింగ్, కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన ఘన స్వాగతం పలికారు.

మహిళల్లో చైతన్యం.. ఆరోగ్య సంరక్షణకు..

అభినందనసభలో మహిళా స్విమ్మర్ గోలి శ్యామల మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం ఆరోగ్య సంరక్షణ, పర్యాటక రంగం అభివృద్ధికి సముద్రంలో ఈతను నేర్చుకున్నామన్నారు. శ్రీలంకనుంచి రామసేతు వరకు, లక్షద్వీప్ సముద్రంలో ఈతఈది పలు రికార్డులు సాధించానన్నారు. అమెరికాలో జరిగిన ఈత పోటీల్లో 36కిలోమీటర్ల కాటలినా ఛానల్‌ని ఈదానన్నారు. ఓ ఆంగ్ల పత్రికలో ఇంగ్లీష్ ఛానల్ ఈదిన వ్యక్తి కథనం ఈత వైపు వెళ్లేలా చేసిందని, లక్షద్వీప్‌లో జరిగిన పర్యాటక అభివృద్ధిలో పాల్గొనేందుకు విచ్చేసిన ప్రధాని మోదీ చేసిన ప్రచారం నాలో స్ఫూర్తిని నింపిందన్నారు. లక్ష్యసాధనకు కృషిచేయాలని, ప్రతిఒక్కరూ ఈత నేర్చుకోవడం ద్వారా తల వెంట్రుక నుంచి శరీరంలో ఉన్న అన్ని భాగాలకు పూర్తి వ్యాయామం చేసినట్లు అవుతుందన్నారు. ప్రపంచంలోనే నాలుగో అంతర్జాతీయ స్విమ్మర్‌గా, దేశంలో నేనే నెంబర్‌వన్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కోచ్‌జాన్ సివిక్ పర్యవేక్షణలో హైదరాబాద్‌లో తాను జాయింట్ స్పోర్ట్స్ నేర్చుకున్నానన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఎదురవుతాయని, అలాంటి సమయంలో ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుందామని భావించకుండా మైండ్ డైవర్షన్ చేసుకోవడం ద్వారా ఒత్తిడినుంచి బయట పడవచ్చన్నారు. ఎమ్మెల్యే రాజప్ప, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ వైడీ రామారావు,కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ జీఎం మురళీధర్, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



స్విమ్మర్ శ్యామలను అభినందిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడ కమిషనర్ భావన, కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు



పోటీల ప్రారంభవేళ పుంగనూరు ఆవుదూడతో ఎమ్మెల్యే వరప్రసాద్

కేశనపల్లిలో రాష్ట్ర స్థాయి ఆవుల అందాల పోటీలు

మలికిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణ చాలా ప్రధాన అంశమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. పశు సంపదను కాపాడుకున్ననాడే గ్రామాలు సిరిసంపదలతో విరాజిల్లుతాయన్నారు. గ్రామీణస్థాయిలో రాష్ట్రస్థాయి ఒంగోలు పాల పోటీలు, ఒంగోలు, పుంగనూరు, గిరి ఆవుల అందాల పోటీలు ఏర్పాటు చేయడం నిర్వాహకుల గొప్పదనానికి నిదర్శనమన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో అడబాల లక్ష్మీనారాయణ (నాని) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ రకాల జాతుల ఆవులను పరిశీలించారు. కాసేపు గుర్రంపై సవారీ చేశారు. కార్యక్రమంలో కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, సూరిశెట్టి శ్రీనివాస్, మందపాటి నాగేశ్వరరావు, గుర్లింక సత్యనారాయణ, అడబాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.









పోటీలో ఆకట్టుకున్న పలు రకాల ఆవులు



విద్యార్థినులు పరీక్ష రాస్తున్న తీరును పర్యవేక్షిస్తున్న చీఫ్ ఎగ్జామినర్, జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ

ప్రశాంతంగా జీఎన్ఎం పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని పలు నర్సింగ్ విద్యా సంస్థల్లో జీఎన్ఎం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి (జీటీజీహెచ్)లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంసీహెచ్ బ్లాకులోని పై అంతస్తులో కేంద్రాన్ని కేటాయించారు. జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రెండు సెషన్లుగా జీఎన్ఎం పరీక్షలు జరుగుతాయని, పరీక్షలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ఈ నెల 11వ తేదీ వరకు, తృతీయ సంవత్సరం వారికి మళ్లీ 6వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం, తృతీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం వేర్వేరుగా పరీక్షలు నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి 21 స్కూల్స్‌కు చెందిన మొత్తం 1,500వందల మంది కిపైగా పరీక్షలు రాస్తున్నారు. ఉదయం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు, మధ్యాహ్నం నుంచి తృతీయ సంవత్సరం విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొలిరోజున మొదటి సెషన్‌లో 981 మందికి 844మంది పరీక్షలకు హాజరయ్యారు. 140 మంది గైర్హాజరయ్యారు. రెండవ సెషన్‌లో 550 మందికి 25 మంది హాజరుకాలేదు. చీఫ్ ఇన్విజిలేటర్ కె.లక్ష్మి, చీఫ్ సూపర్‌వైజర్ ఆఫీసర్ ఆర్.శ్యాంసుందరరావు, ఆసుపత్రి మేనేజర్ కె.కేదారేశ్వరరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వీరుళ్లమ్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించేందుకు గోదావరి జలాలను తీసుకువస్తున్న మహిళలు

వీరుళ్లమ్మకు వైభవంగా హరిద్రాభిషేకం



అనపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మకు శుక్రవారం 1008 మంది ముత్తయిదువులు హరిద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి మహిళలు ఎర్ర కాలువ వద్దకు చేరుకుని గోదావరి జలాలను కలశాల్లో నింపుకున్నారు. మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని జలాల్లో హరిద్రం కలిపి అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. హరిద్రాభిషేకంలో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాంబూలం, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.



వీరుళ్లమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు హరిద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తురాలు

ఆదిత్య యూనివర్శిటీని సందర్శించిన సినీ ప్రముఖులు

గండేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీకి తెలుగు సినీ ప్రముఖులు పలువురు శుక్రవారం విచ్చేశారు. ఇంద్ర, సమరసింహారెడ్డి వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన ప్రముఖ దర్శకుడు బి.గోపాల్, మెగాస్టార్ చిరంజీవితో 25కు పైగా విజయవంతమైన చిత్రాలు తీసిన ఎ.కోదండరామిరెడ్డి, తెలుగులోనే కాకుండా కొన్ని బాలీవుడ్ సినిమాలకు పని చేసిన ఎస్.గోపాల్ రెడ్డి, ప్రముఖ సంగీత దర్శకుడు కోటి సందర్శించారు. వారందరికీ ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.



సినీ ప్రముఖులను సత్కరించిన ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్ శేషారెడ్డి

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

● మంత్రి అచ్చెన్నాయుడు ● మత్స్యకారులకు నష్టపరిహారం అందజేత



కోరింగలో మత్స్యకారులకు నష్ట పరిహారం చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు





సభలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తామని, ఆ వృత్తి చేస్తూ జీవనోపాధి కోల్పోయిన నష్టపోయిన రైతులకు 23,450 మందికి ఓఎన్‌జీసీ ద్వారా ఒక్కొక్కరికి రూ.63,250 చొప్పున మొత్తం రూ.148 కోట్ల37లక్షల18,500 నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యకాశాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలో ఓఎన్‌జీసీ పైపు లైను వల్ల నష్టపోయిన మత్స్యకారులకు నష్టపరిహారం ఓఎన్‌జీసీ సంస్థ నుంచి అందజేశారు. శుక్రవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేసేందుకు కృషి చేస్తుందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసిపోయిందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని గాడిలోపెట్టేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నారన్నారు. మరో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి 20,878 మందికి రూ.63,250 చొప్పున రూ.132కోట్ల 5లక్షల33వేలు, పి.గన్నవరం, కొత్తపేట, మండపేట, రామచంద్రపురంలో 69మందికి సుమారుగా రూ.16 కోట్లు మొత్తం 23,458మందికి రూ.148కోట్ల 38లక్షలు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలి పారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీ రుణాలు, వలలు, పనియుట్లు అం దించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1000 కిలోమీటర్లు వరకు కోస్టల్ ప్రాంతం ఉందని దీన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్ మాదుర్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరావు, అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మత్స్యశాఖ కమిషనర్ టిడోలా శంఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మార్చి నాటికి పన్నులు వసూలు చేయాలి

కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో 6 మున్సిపాల్టీలపై

రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు సమీక్ష





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ...పాల్గొన్న కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది

కొవ్వూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మార్చి నాటికి ఆస్తి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సిహెచ్. నాగనరసింహరావు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు సమీక్షా సమావేశాలకు పూర్తి సమాచారంతో హజరుకావాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో శుక్రవారం కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 6 మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను, కుళాయి పన్ను, పారిశుధ్యం, ఇంటింటా చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరుచేయడం, ట్రేడ్ లైసెన్సులు, తాగునీటి సరఫరా, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్ వంటి అంశాలపై మున్సిపాల్టీల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం టౌన్ ప్లానింగ్, మెప్మా సిబ్బందితో సమీక్ష చేశారు. నాగనరసింహరావు మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాల వారీగా మున్సిపాల్టీల ప్రగతిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కొన్ని మున్సిపాల్టీలు సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్‌లోను, పన్నుల వసూలు, కొత్త అసెస్‌మెంట్లు, ఎడిషన్ అల్టేషన్స్‌లో బలహీనంగా ఉన్నాయన్నారు. మున్సిపాల్టీల డేటాను కమిషనర్ చెక్ చేయకుండా ఆర్డీ కార్యాలయానికి పంపించవద్దన్నారు. మండపేట, రామచంద్రాపురం, ముమ్మిడివరం మున్సిపాల్టీలు నాన్ రెసిడెన్స్ ప్రాంతాలని, కమర్షియల్ ప్రాంతాల్లో ఆదాయం పెంచుకోవడానికి కౌన్సిల్ ఆమోదంతో గెజిట్ పబ్లికేషన్ చేసుకోవాలన్నారు. తదుపరి సమావేశానికి గెజిట్ పబ్లికేషన్ చేయకపోతే కమిషనర్లు వివరణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను తగలబెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలు ఉదయం నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్‌లో అటెండెన్స్ తనిఖీ చేస్తామన్నారు. జనవరి నెలాఖరులోగా మున్సిపాల్టీల్లో గుంతలు పడిన రహదారుల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని లేకుంటే మున్సిపాల్టీల నిర్వహణ, అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఆస్తి పన్ను, వడ్డీ మాఫీ ఉండదన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి అందించి, సహకరించాలన్నారు. ప్రతి నెల సమీక్షా సమావేశాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, నిడదవోలు, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌లు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

కళాశాలకు బయలుదేరి.. అంతలోనే కన్నుమూసి!

ఆగి ఉన్న కంటెయినర్‌ను బైక్ ఢీకొని విద్యార్థి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



కంటెయినర్‌ను బైక్ ఢీకొన్న దృశ్యం



నవనీత్ (ఫైల్)

అనపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుగుదురులో నిమ్స్ కళాశాలలో ఫిజియోథెరపీ విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22), ద్వారకా తిరుమల మండలం కమరి గ్రామానికి చెందిన మానుకొండ చందు కాకినాడ జిల్లా పెనుగుదురు గ్రామంలోని కిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో చదువుకుంటూ అదే కళాశాలలోని హాస్టల్‌లో ఉంటున్నారు. ఇద్దరూ బైక్‌పై కళాశాలకు వెళ్తుండగా పులగుర్త గ్రామం వచ్చే సరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖమ్మం నుంచి కాకినాడ వెళ్లే కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. తీవ్రగాయాలపాలైన ఇద్దరినీ స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే నవనీత్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చందుకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

ప్రక్కిలంకలో విషాదఛాయలు

తాళ్లపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద జరిగిన ప్రమాదంలో ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్ మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవనీత్ పెనుగుదురులోని కిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. నవనీత్ తండ్రి బాల మురళీకృష్ణ ప్రక్కిలంకలోని పైడి ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేస్తుండగా తల్లి భారతి మండలంలోని గజ్జరం గ్రామంలో సచివాలయ మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. సోదరుడు స్నేహిత్ రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో బీఎస్సీ (ఫోరెన్సిక్) ఫైనలియర్ చదువుతున్నాడు. అన్నదమ్ములిద్దరూ కవలలు. నవనీత్ మృతితో ఆ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. నవనీత్ తల్లి భారతి రోదనలు మిన్నంటాయి.

హైవేపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా..

బైక్ హ్యాండిల్ లారీకి తగిలి యువకుడి మృతి.. మరో యువకుడికి స్వల్ప గాయాలు



సంఘటనా స్థలంలో మరణించిన భరత్‌చంద్ర

రాజానగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగి ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా గైట్ కళాశాల సమీపంలో హైవేపై శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20), గొల్లపల్లి నాగేంద్ర స్నేహితులు. పెయింటింగ్ పనులు చేస్తుంటారు. కాకినాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భరత్‌చంద్ర బంధువు అయిన కృష్ణబాబుకు సీరియస్‌గా ఉందని సమాచారం రావడంతో గురువారం రాత్రి మోటార్‌సైకిల్‌పై కాకినాడ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం తిరిగి తొర్రేడు పయనమయ్యారు. మార్గమధ్యలో గైట్ కళాశాల వద్దకు వచ్చే సరికి హైవేపై ముందు వెళ్తున్న లారీని అధిగమిస్తున్న తరుణంలో మోటార్‌సైకిల్ హ్యాండిల్ లారీకి తగలడంతో అదుపుతప్పి బైక్ నడుపుతున్న భరత్‌చంద్ర అదే లారీ కిందపడి పడి అక్కడికక్కడే మరణించాడు. నాగేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కేవీ నాగార్జున తెలిపారు.

అంగరలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

▸▸ లీకేజీని అరికట్టిన అధికారులు, సిబ్బంది ▸▸ భయాందోళనలో గ్రామస్తులు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో శుక్రవారం ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీకైంది. దీంతో గ్రామస్తులు ఏం జరుగుతుందోనని భయాందోళనలు చెందారు. ఓఎన్జీసీ, ఫైర్ అధికారులు, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో ఓఎన్జీసీ డ్రిల్‌పాయింట్ నుంచి వేరే చోటుకు వెళ్లే పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకైంది. దీంతో దానికి సంబంధించిన 4 ఛానల్స్‌ను మండపేట గ్యాస్ కలెక్టింగ్ స్టేషన్ నుంచి మూసివేశారు. లీకైన గ్యాస్ ప్రెజరు తగ్గించేందుకు ఫైర్ సిబ్బంది వాటర్ స్ప్రే చేయడంతో గ్యాస్ ప్రెజర్ జీరోకు తగ్గిందని మండపేట ఫైర్ ఆఫీసర్ హనుమంతరావు తెలిపారు. అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి లీకేజీని అరికట్టడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అంగరలో ఓఎన్జీసీ పాయింట్ వద్ద గ్యాస్ లీకేజీ ఏర్పడినట్టు తెలియడంతో ఆ ప్రాంతాన్ని అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. సంఘటనకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సైట్ ఇన్‌చార్జ్ సుబ్బారావును వివరణ అడగ్గా అడుగున ఉన్న పైప్‌లైన్ శుభ్రం చేస్తుండగా యు బెండ్ జాయింట్ వద్ద ప్రెజర్‌కు గ్యాస్ లీకై బయటకు వచ్చిందని, వెంటనే దాన్ని బంద్ చేశామన్నారు. కానీ ఆపైప్‌లోని గ్యాస్ కొంత బయటకు వచ్చిందని తెలిపారు. దీనిపై రిస్క్ ఏమైనా ఉంటుందా అని అడగగా ఎలాంటి రిస్క్ ఉండదని, టెక్నీషియన్స్ పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుందన్నారు. దీనిపై గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తుండగా రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీ, జిల్లా కలెక్టర్, ఓఎన్జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ పి.చిన్నారావు, మండపేట సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్, ఈవోపీఆర్డీ మోహన్,సర్పంచ్ కోటేశ్వరరావు పరిశీలించారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగిఉండాలి

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

కాకినాడలో విద్యావైజ్ఞానిక ప్రదర్శన





మానవ అస్థిపంజరం, ఐడీ కార్డు చెకింగ్ స్కానర్ ప్రదర్శనలు

కాకినాడ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. కాకినాడ సాలిపేట పీఎస్‌రాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఆధ్వర్యంలో దక్షిణభారత విద్యావైజ్ఞానిక ప్రదర్శన 2025కు సంబంధించిన జిల్లాస్థాయి పోటీలను శుక్రవారం జిల్లాసైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు కె.పద్మశ్రీ, ఐ.వెంకటేశ్వరరావు, కౌడా ఛైర్మన్ తమ్మల బాబు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ పాల్గొని వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎప్పుడూ విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను మాత్రమే తెలియజేయాలన్నారు. పద్మశ్రీ మాట్లాడుతూ మానవ మెదడే అతిపెద్ద కంప్యూటరని ఆలోచనలకు పదునుపెడితే ఏదైనా సాధించవచ్చన్నారు. సుధీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వివిధ నూతన కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నదన్నారు. అతిథులు జ్యోతిప్రజ్వలనచేసి పోటీల లోగోను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అతిథులు పరిశీలించారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల నుంచి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు 109 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో 36, గ్రూప్‌లో 39, ఉపాధ్యాయుల విభాగంలో 34 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో డీఈవో పి.రమేష్, కాకినాడ, పెద్దాపురం డీవైఈవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌శర్మ, జీసీడీవో ఉమా మహేశ్వరి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మొదటి రెండుస్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని డీఈవో తెలిపారు. విజేతలకు యంగ్ మైండ్స్ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ పరీక్షా అట్టలు, పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి పి.వేణుగోపాలరావు, ఎంఈవోలు సీహెచ్ రవి, సత్యనారాయణ, శ్రీనివాసరావు పీడీలు బంగారాజు, రవిరాజు, రంగారావు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు

దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా మహిళా అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు నాలుగో రోజైన శుక్రవారం ప్రత్యేకంగా మహిళలకు కేటాయించారు. మొత్తం 295మంది హాజరు కాగా తదుపరి పరీక్షకు 180మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థినులకు నిర్వహించిన పరీక్షలను జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.

కత్తితో బెదిరించి..

గోల్డ్ చైన్ చోరీ చేసిన ఇద్దరి అరెస్టు

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కత్తితో చంపుతానని బెదిరించి బంగారు చైన్, నగదు చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. పిఠాపురం మండలం నరసింగపురానికి చెందిన బొలిశెట్టి వెంకటరమణ, లక్ష్మీ పిఠాపురంలోని పూర్ణా, అన్నపూర్ణా థియేటర్ వద్ద నడిచి వెళ్తుండగా ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం ఇద్దరు బైక్‌పై వచ్చి వారిని కత్తితో పొడిచి చంపుతామని బెదిరించి బంగారు గొలుసు, రూ.500 చోరీ చేసి పరారయ్యారు. ఎస్ఐ, సర్కిల్ క్రైమ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విచారణ జరిపి చోరీకి పాల్పడిన పిఠాపురం రథాలపేటకు చెందిన పూడి గంగాధర్, మంగితుర్తి గ్రామానికి చెందిన డెక్కల ఆనంద్‌ను అరెస్టు చేసి వారి నుంచి బంగారు చైన్, బైక్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

సరదాగా ఈతకు దిగి

గోదావరిలో యువకుడు గల్లంతు



గల్లంతైన వీరమణికంఠ (ఫైల్ ఫొటో)

ముమ్మిడివరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సరదాగా గోదావరిలో ఈతకు దిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన ముగ్గురు యువకులు సరదాగా కేశనకుర్రు గోదావరి పాయ చెంతకు వెళ్లారు. వారిలో మంగ విజయవీరమణికంఠ (19) కొద్దిగా ఈత రావడంతో గోదావరిలో దిగాడు. స్నేహితులు మంగ జశ్వంత్, పొత్తూరి పార్థసారధిలకు ఈత రాకపోవడంతో వారు ఒడ్డునే ఉన్నారు. మణికంఠ గోదావరిలో దిగా కొంతదూరం ఈదినా తరువాత ఉక్కిరిబిక్కిరి కావడంతో గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. వారు ముగ్గురు ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కొత్లంలకకు చెంది మంగ నాగేశ్వరరావు-మహలక్ష్మి దంపతులకు లక్ష్మీనవీనసాయిశ్రీ కుమార్తెలు ఉండగా, విజయవీరమణికంఠ ఆఖిరి సంతానం. ఒక్కగానొక్క కుమారుడు గోదావరిలో గల్లంతు కావడంతో ఆ కుటుంబలోను, గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఎస్ఐ డి.జ్వాలాసాగర్, పోలీసులు గోదావరి నదీ పాయలో గాలింపు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు మణికంఠ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

రూ.3.42 లక్షల విలువైన 68.6 కిలోల గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం

జగ్గంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను శుక్రవారం జగ్గంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 31న కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామం టోల్‌గేట్ వద్ద గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో అర్ధరాత్రి వేళ టోల్‌ప్లాజ్ వద్ద సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ బృందంతో కలిసి యూపీ81 బీడీ4243గల కారును ఆపగా ఆపినట్టే ఆపి ఒక్కసారిగా వేగంగా నడపడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ లోవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటకే కాకినాడ మెడికోవర్ ఆసుపత్రికి తరలించారు. అయితే కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆ కారులో గంజాయి ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిందితుల కోసం గాలించగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన తరుణ్‌కుమార్, జాహిద్, ముస్తాకిమ్, మహ్మద్ జాఖీర్‌ఖాన్‌ను శుక్రవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామం పోలవరం కాలువ వద్ద కారుతో అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఆలీఘడ్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.3.42 లక్షల విలువైన 68.6 కిలోల గంజాయి, రూ.20.5 లక్షలు విలువైన కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నింది తులను పట్టుకునేందుకు ఎంతో కృషి చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ సతీష్, క్రైం హెచ్‌సీ జె.నాగరాజు, కానిస్టేబుల్ ఆర్.లోవరాజు, టీఎస్ దుర్గాప్రసాద్, ఎ.జయరాం, హోంగార్డు ప్రసాద్, గిరిలను ఎస్పీ అభినందించారు. విధి నిర్వహణలో గాయపడిన కానిస్టేబుల్ లోవరాజును పరామర్శించారు. లోవరాజు భార్య, కుటుంబ సభ్యులకు ఎస్పీ ధైర్యం చెప్పి వైద్యానికి అయ్యే ఖర్చు అంతా పోలీస్ శాఖ భరిస్తుందని ధైర్యంగా ఉండాలన్నారు.



జగ్గంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

నేడు గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్

కడియం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రౌండ్‌లో శనివారం జరిగే గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హైదరాబాదుకు చెందిన ఈవెంట్ నిర్వాహకులు వేదికను సిద్ధం చేస్తున్నారు. సభా వేదిక వద్ద ట్రాఫిక్ విధానాలను పరిశీలించడానికి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, ఏఎస్పీలు ఏటీఎన్ మురళీకృష్ణ, సుబ్బరాజు, డీఎస్పీలు భవ్యకిషోర్, దేవకుమార్, రమేష్, పలు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. లక్ష మంది పైగా మెగా అభిమానులు ఈ ఈవెంట్‌ను తిలకించడానికి వస్తారని అంచనా. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, దర్శకులు శంకర్, సినిమా యూనిట్ ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఆలిండియా చిరంజీవి ఫాన్స్ అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, చిరంజీవి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి, మెగా అభిమానులు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.



ఈవెంట్‌కు సిద్ధం అవుతున్న వేదిక

ముక్కామల పీహెచ్‌సీని తరలించవద్దు

అంబాజీపేట, జనవరి3(ఆంధ్రజ్యోతి): ముక్కామలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని పుల్లేటికుర్రు తరలించవద్దని, అక్కడే సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు బండారు మల్లి, వార్డు సభ్యులు కోరారు. విజయవాడలోని గొల్లపూడిలో కార్యాలయంలో డైరెక్టర్‌ఆఫ్‌హెల్త్ అధికారి పద్మావతిని కలిసి వినతిపత్రాన్ని అందించారు.

ఎంపీని కలిసిన టీడీపీ నాయకులు

మలికిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను అమలాపురంలో రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కలిసి అభినందించారు. అనంతరం ఎంపీని సత్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, టీడీపీ మండల నాయకులు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల నాగు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి సావిత్రిబాయిపూలే విశేష కృషి

- పలు చోట్ల పూలే జయంతి వేడుకలు
- సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు



ముమ్మిడివరం: పూలేకు నివాళులర్పిస్తున్న తహశీల్దార్ సుబ్బలక్ష్మి తదితరులు

ముమ్మిడివరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే మహిళా అభివృద్ధి సాధ్యమని, మహిళా విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే అని తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో డాక్టర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్బలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, కొంకి రాజామణి, మెండి కమల, జనిపల్లి సత్యనారాయణ, కుంచే చిన్నబాబు, యలమంచిలి బాలరాజు, నందిక ధనరాజు, నేరేడుమిల్లి అబ్బులు, దోనిపాటి ఆంజనేయులు, దేవరపల్లి ఏడుకొండలు, వై.వెంకటేశ్వరరావు, దాసరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, డాక్టర్ రావుబహదూర్ రఘుపతివెకంటరత్నం నాయుడు డిగ్రీ కళాశాలల్లో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, డైరెక్టర్లు జగతా సురేష్, అధ్యాపకులు గుర్రం మహేష్, గణేశుల సత్యనారాయణ, సీహెచ్ సత్యనారాయణ, కె.నాగేంద్ర, టి.శ్రీనివాస్, వంగా విశాల, బండారు వీరలక్ష్మి, ఆకుల దుర్గ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతిని నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మహిళా సంఘ నాయకురాలు నిమ్మకాయల ధనలక్ష్మి, ఏపీ రమణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సభిలే సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, దొమ్మేటి వీర రాఘవులు, నిమ్మకాయల వెంకటేష్, అనుచూరి లక్ష్మణరావు, లంకరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

ఎంపీపీ నివాళి

అంబాజీపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలందించిన సావిత్రిబాయి పూలే సేవలు అభినందనీయమనిఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పూలే చిత్రపటానికి ఎంపీపీ పూలమాలలు వేసి నివాళులుర్పించారు. అంబాజీపేట, తొండవరం జిల్లాపరిషత్ హైస్కూల్స్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కడలి సాయిరామ్, పి.వి.కేశవచార్యులు పాల్గొన్నారు. అలాగే పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సర్పంచ్ జల్లి బాలరాజు, కార్యదర్శి లక్ష్మిపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్తాబత్తుల ప్రశాంత్, ఉందుర్తి నాగబాబు, మైలా ఆనందరావు, సుదాబత్తుల రాము పాల్గొన్నారు.

రాజోలులో నివాళి

రాజోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగాధిపతి పి.శైలజ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి శైలజ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో ఎన్.రాజు, సరిత, అశ్విని, డాక్టర్ బోస్, శ్రీదేవశ్యామసుందర్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విద్యను ప్రోత్సహించిన పూలే

మామిడికుదురు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ విద్యను ప్రోత్సహించిన మొట్టమొదటి మహిళ సావిత్రిబాయిపూలే అని పలువురు కొనియాడారు. సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని మామిడికుదురు సాంఘిక సంక్షేమ వసతిగృహం వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుబ్బల మురళీకృష్ణ, భూపతి మనోహర్‌రాజు, నయినాల రఘురామయ్య, బయ్యా మోహన్, మట్టా నాగరాజు, రాయుడు శ్రీను, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే

మలికిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పూలే అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నివాళులర్పించారు. మహిళల అభ్యుదయం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. కార్యక్రమంలో నల్లి శివ, గుబ్బల బాబ్జి, గెడ్డం తులసీభాస్కర్, యేడిద శ్రీదేవి, గెడ్డం ఫిలిప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి 'కూటమి' కృషి

రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జనచైతన్య దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మలికిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దివ్యాంగ సంఘం నాయకులు మాట్లాడుతూ 2016 దివ్యాంగుల చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని, దివ్యాంగులకు ప్రభుత్వ రుణాలు అందజేయాలని తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బి.నరసింహస్వామి, ఎస్ఎస్ మూర్తి, వెంకటలక్ష్మి, సుధాకర్, ఏసుబాబు పాల్గొన్నారు.

కాపు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

మామిడికుదురు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన కాపు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ఈనెల19న అందించనున్నట్టు మండల శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తెలిపారు. తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్రప్రభు (గుంటూరు) ఆర్థికసాయంతో రాజోలు తాలూకా తెలగ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలానికి చెందిన విద్యార్థులకు పురస్కారాలు అందిస్తారని తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం నుంచి పీజీ వరకు 80శాతం, అంతకన్నా ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు పురస్కారాలకు అర్హులన్నారు. వివరాలకు 953450909, 9000297780 నెంబర్లలో సంప్రదించాలన్నారు. జి.లక్ష్మీనారాయణ, వి.సాయిబాబు, బి.నాగేశ్వరరావు, మాగాపు దుర్గారావు, వైవీ సత్యనారాయణ, వై.భీష్మశ్రీ పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి: ఎమ్మెల్యే



అదనపు తరగతుల భవన సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్య సామాజిక అభివృద్ధికి ప్రధాన అస్త్రమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.08కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదుల సముదాయాన్ని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రతి పాఠశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, స్కూలు ఛైర్మన్ నల్లా దుర్గారావు, వైస్ ఛైర్మన్ ముషిని లక్ష్మి, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, చొల్లంగి సత్తిబాబు, ఆరుమిల్లి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, కుంపట్ల నాయుడు, యడ్ల ఏసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

మామిడికుదురు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ పటిష్టానికి భైరిశెట్టి దుర్గా రామకృష్ణ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా సూచించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన రామకృష్ణకు అయ్యాజీవేమా పూలమాలలువేసి అభినందించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, నాయకులు మెండా ఆదినారాయణ, తాడి సత్తిబాబు, ఆకుల దొరబాబు, అడపా వెంకటరత్నం, నక్కా త్రిలోచనరావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, కోటిపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ



బీజేపీ మండల అధ్యక్షుడిగా మామిడికుదురుకు చెందిన భైరిశెట్టి దుర్గారామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ మాజీ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా రామకృష్ణ, మండల అధికార ప్రతినిధిగా కంకిపాటి సుబ్బారావును ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. రిటర్నింగ్ అధికారిగా జిల్లా జనరల్ సెక్రటరీ గనిశెట్టి వెంకటేశ్వరరావు, ఏఆర్వోగా భైరిశెట్టి వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

బీజేపీ కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కొత్తలంకలో కొడమర్తి వెంకటరత్నశర్మ స్వగృహం వద్ద బీజేపీ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో బీజేపీ ముమ్మిడివరం రూరల్ మండల అధ్యక్షుడు పి.వీరవెంకటసత్యనారాయణమూర్తిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలిగా చప్పిడి శ్రీదుర్గ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధికార ప్రతినిధిగా గొలకోటి వెంకటరెడ్డి, క్రియాశీలక సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నారు. మండల ఆర్వో గ్రంధి నానాజీ పరిశీలకునిగా వ్యవహరించగా పరిశీలకుడు కర్రి చిట్టిబాబు సమక్షంలో ఎన్నిక జరిగింది. సమావేశంలో పార్టీ భవిష్యత్తు ప్రణాళిక రూపొందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి: సుభాష్

ఒక కుటుంబానికి రూ.50వేలు సాయం

అంతర్వేది, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో కేన్సర్ పేషెంట్ల సంఖ్య పెరుగుతుందని, ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఆహార అలవాట్లను మార్చుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ చెప్పారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మార్గాని నీలిమ చెన్నైలో చికిత్స పొందుతోంది. సఖినేటిపల్లిలంక గ్రామంలో ఆమె తండ్రి కొండలరావుకు ఎన్‌ఆర్‌ఐ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ సమకూర్చిన రూ.50వేలను మంత్రి, ఎంపీ శుక్రవారం అందజేశారు. రేవూరి ఏసు, ముప్పర్తి నాని, కొండా కిశోర్, పడాల శంకరం, నాగబాబు, తాడి సత్యనారాయణ, పాటి శివకుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తవ్వేశారు..వదిలేశారు..



పూడికను తొలగించి గట్టును పడేసిన దృశ్యం

కాట్రేనికోన, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన చిలకమ్మచెరువు నుంచి అయినాపురం వరకు విస్తరించిన లంకలకాల్వలో ఇటీవల పూడికతీత పనులు చేశారు. తొలగించిన మట్టిని కాల్వ గట్టున రోడ్డు పక్కనే వదిలేశారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ముమ్మిడివరం-కాట్రేనికోన రహదారిపై ఈమట్టి వల్ల రాకపోకలకు మరింత ఇబ్బంది ఏర్పడింది. పూడిక మట్టిని అక్కడి నుంచి తొలగించకపోతే ప్రయోజనం ఏముంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. వర్షానికి మట్టి అటు కాల్వలోకి, ఇటు రోడ్డు మీదకు వెళ్లి అసలు లక్ష్యం దెబ్బతింటుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మట్టిని తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఇదేకాల్వ గట్టు పలుచోట్ల ఆక్రమణకు గురయ్యింది. కొన్ని చోట్ల కాల్వ పంటబోదెగా మారిపోయింది. దీనిపై రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించకపోతే కలెక్టర్‌ను ఆశ్రయిస్తామంటున్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం

కాట్రేనికోన, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఎం.శ్రీహరిని శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది సత్కరించారు. శ్రీహరి దంపతులను నూతన వస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.లిఖిత, పి.నీలిమ, సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, ఎంపీడీవో ఎస్పీ చలం, ఎంఈవో ఎం.వెంకటరమణ, పీహెచ్‌ఎన్ జి.రమాశేషులు, హెచ్‌ఎస్ కె.రామమోహన్, హెచ్‌వీ జేవీ రమణమూర్తి, కె.సాయిశ్రీ, ఎం.దుర్గమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఐ.పోలవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఉపాధ్యాయ బృందం మురమళ్లకు చెందిన నడింపల్లి సూర్యవర్మ ఆర్థిక సహకారంతో ప్రచురించిన టెన్త్ స్టడీమెటీరియల్‌ను శుక్రవారం మండలంలోని 11ఉన్నత పాఠశాలలకు చెందిన 659మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కొండారెడ్డి, కె.తిరుమలరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, ప్రతినిధులు పెన్నాడ శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.అప్పలస్వామి, వి.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వలో పూడికతీత

మామిడికుదురు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని ప్రధాన పంటకాల్వలో పేరుకుపోయిన పూడికతీతను పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో మామిడికుదురు సెంటర్ నుంచి నూకాలమ్మ ఆలయం వరకు కాల్వలోని చెత్తా చెదారాలు, వ్యర్థాలను జేసీబీతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతాలకు తరలించారు. దీనిపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని హైదరాబాద్‌కు చెందిన మంత సత్యనారాయణమూర్తి-కామేశ్వరి దంపతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.11,116 విరాళం అందజేశారు. వీరికి అర్చకులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి చిత్రపటం అందించారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

అల్లవరం జనవరి 3(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు మేజర్ పంచాయతీ పరిధిలో శివాలయం ఏటిగట్టు సమీపాన శ్మశానవాటికను అభివృద్ధి పరచాలని గ్రామస్తులు కోరారు. శ్మశానవాటికతో పాటు వెయిటింగ్ రూము, దహన పొయ్యిలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, అడపా శ్రీనివాసరావు, అయిల వెంకట నాగేశ్వరరావు, మొయిల గణపతిరావు కోరారు.

జమీలును సత్కరించిన కృషీవల కంపెనీ ప్రతినిధులు

అంబాజీపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరి కమిషన్ (ఏపీఈఆర్సీ) సభ్యుడిగా నియమితులైన ముత్యాల శ్రీరామనాగేంద్రప్రసాద్(జమీలు)ను కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రతినిధులు సత్కరించారు. స్థానిక సొసైటీ కార్యాలయంపైన ఉన్న కృషీవల కంపెనీ కార్యాలయంలో కంపెనీ ఛైర్మన్ గణపతి వీరరాఘవులు ఆధ్వర్యంలో జమీలును దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, అడ్డాల గోపాలకృష్ణ, అరిగెల బలరామమూర్తి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, పూర్ణిమ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తాటిపాక, తాటిపాక మఠం గ్రామాలకు శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఏఈ రవికుమార్ శుక్రవారం తెలిపారు. 11 కేవీ లైన్‌పై చెట్టుకొమ్మలు కటింగ్ కోసం సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యోగుల ధర్నా

ముమ్మిడివరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ నగర పంచాయతీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కమిషనర్ పి.రవివర్మకు అందించారు. సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్, నక్కా అరుణ్‌కుమార్, గుత్తుల రమేష్, వంటపాటి వెంకటేశ్వర్లు, యల్లమిల్లి వెంకటరమణ, రుద్రరాజు అరుణ, కె.ఈశ్వర్, ఎం.జాన్, జె.సురేష్, ఎస్.బొజ్జమ్మ పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ముమ్మిడివరం, జనవరి3(ఆంధ్రజ్యోతి): రైజింగ్ హోప్ ఫౌండేషన్ సహకారంతో అమలాపురం విజయ ఆసుపత్రి ఆధ్వర్యంలో అయినాపురం పంచాయతీ పరిధి కోమటిచెరువు జాన్ మెమోరియల్ చర్చిలో మెల్లం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 35మంది వితంతువులు, మహిళలకు చీరలు, దుప్పట్లు అందజేశారు.డాక్టర్ గంటా అంబేడ్కర్‌రతన్‌బెనర్జీ, పాస్టర్ వి.సువర్ణరాజు, డి.అమ్మాజీ, ఎం.రత్నం, జి.సుధాకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి

అల్లవరం జనవరి 3(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సొసైటీ సభ్యుల ఈకేవైసీ, కమ్యూనిటీ సర్వే, ఎంఎస్ఈ సర్వే అంశాలపై దృష్టి సారించాలన్నారు. కొమరగిరిపట్నంలో సొసైటీ సభ్యుల ఈకేవైసీ 10శాతం పూర్తికానందున రెండురోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఏవో బి.లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, చిక్కం శ్రీనివాస్, ఎస్.రాజమోహన్, ఎస్.దుర్గాశ్రీను, కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

పి.గన్నవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కె.ఏనుగుపల్లి గోదావరిలో ఈనెల1న వేటకు వెళ్లి గల్లంతైన వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన శేరు వీరకనకరాజు(40) మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి యానాంలో 'మన ఊరు శుభ్రత'

యానాం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మనఊరు శుభ్రత కార్యక్రమంపై శుక్రవారం తన స్వగృహంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమావేశం నిర్వహించారు. మల్లాడి మాట్లాడుతూ ఇటీవల యానాంలోపారిశుధ్యం సక్రమంగా లేదన్నారు. జనవరి6నుంచి యానాం ప్రజాఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈఉత్సవాలకు గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు హాజరవుతారన్నారు. ఈనేపథ్యంలో యానాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో శనివారం నుంచి మన ఊరు శుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ట్రాక్టర్‌ను తప్పించబోయి కారు బోల్తా

నలుగురికి స్వల్ప గాయాలు


జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణం వద్ద రోడ్డు ప్రమాదం దృశ్యం

ఆలమూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను తప్పించబోయిన కారు బోల్తాపడింది. స్థానికుల కథనం ప్రకారం...రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణం వద్ద రోడ్డు ప్రమాదంగా ఉండటంతో ఇసుక ట్రాక్టర్‌ను తప్పించబోయి కారు బోల్తా పడిందని వారన్నారు. కారులో ఉన్న నలుగురు ప్రయాణికులను రక్షించా మని, వారికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికు లన్నారు. రోడ్డు పనులు చేపట్టకపోవడంతో పాటు సర్వీసు రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. దీంతో తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.


బడుగువానిలంక రెవెన్యూ సదస్సులో ఆందోళన చేస్తున్న అఖిల భారత రైతుకూలీ సంఘం

రెవెన్యూ సదస్సులో రైతుకూలీ సంఘం ఆందోళన

ఆలమూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న భూమిని పేదలకు అందించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్వర్యంలో బడుగువానిలంక రెవెన్యూ సదస్సులో ఆందోళన చేశారు. శుక్రవారం ఆలమూరు తహశీల్దార్ కేజే ప్రకాష్ బాబు అధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిపారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనుపెళ్ల సూరిబాబు అధ్వర్యంలో సదస్సులో కొద్దిసేపు ఆందోళన చేశారు. బడుగువానిలంక గ్రామంలో 110 పట్టా భూముల సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశారు. దీనిపై విచారణ జరిపి ఈనెల 20 తరువాత చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులు తుళ్లూరి ప్రేమానందం, ఉండ్రాసపు ప్రసాద్, గరికమిల్లి చినసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వేకువ జామునే స్వామివారికి గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం జరిపారు. నోము ఆచరించిన పలువురు భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,97,671 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. స్వామివారి అన్నదాన ట్రస్టుకు కాళ్లకు చెందిన మొగళ్ళ మోహన్ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం ఇవ్వగా, దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.


దాతలకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

తప్పుడు కేసులు పెట్టారని ఫిర్యాదు

ద్రాక్షారామ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తనపై తప్పుడు కేసులు పెట్టారని సర్పంచ్ కట్టా గోవిందు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గురువారంనాడు తాను పొలంలో విత్తనాలు వేయగా పండు రమేష్, పిల్ల మణికంఠ, పిల్లి నాగమణి, వాసంశెట్టి చంద్రశేఖర్, కొప్పిశెట్టి నాగేంద్ర, టీడీపీ నాయకులు తన పొలం వద్ద అల్లరి సృష్టించి తప్పుడు కేసులు పెట్టేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 2న తన మేనమామ గుత్తుల సత్యానారాయణ పందలపాకలో స్వర్గస్థులు కావడంతో తాను పందలపాకలో ఉండగా పొలం వద్ద పండు రమేష్ ద్వారా అల్లరి సృష్టించి అరెస్టు చేయిస్తామని తమ బంధువులకు ఫోన్‌లో బెదిరించారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

కిశోరి వికాసంపై శిక్షణ

రాయవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం కిశోరి వికాసంపై మండల సాయి శిక్షకులకు శిక్షణా నిర్వహించారు. ఐసీడీఎస్ అధ్వర్యంలో జరిగిన శిక్షణలో పాల్గొన్న ఐసీడీఎస్ పీవో ఎ.గజలక్ష్మి, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన మాట్లాడారు. కార్యక్రమంలో వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణకృష్ణారెడ్డి, రిసోర్సు పర్సన్స్, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

'రేవ్ పార్టీ పాపం కూటమి ప్రభుత్వానిదే'

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31న రాత్రి మండపేటలో జరిగిన రేవ్ పార్టీ ఎవరి అండదండలతో జరిగిందనే దానిపై అధికార పార్టీ జవాబు చెప్పాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు. వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంఘటన అధికార పార్టీ అండదండలతో జరిగిందని ఆరోపించారు. ఇది జరిగినప్పుడు అధికార పార్టీ, పోలీసు యంత్రాంగం ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. లే అవుట్ యజమాని కోమ్ము రాంబాబు అని అతడిని ఈ సంఘటనకు బాధ్యుడిని చేయటం సరికాదన్నారు. మండపేటలో జరిగిన రేవ్ పార్టీ సంఘటనపై అధికార పార్టీ సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

గోదావరి ట్రోఫి పోటీలకు సర్వం సిద్ధం చేయాలి

ఆత్రేయపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫి పోటీలకు ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. శుక్రవారం లొల్ల లాకుల వద్ద వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం జరిపారు. సంక్రాంతికి ముందుగా నిర్వహించనున్న ట్రోఫి సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికారులు సత్వరమే పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, సమన్వయంతో పనిచేసి సర్‌ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫి పోటీలు, పడవ, ఈత పోటీలతో పాటు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా ప్రదేశాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.

ఐలవ్ ఆత్రేయపురం బోర్డు ఆవిష్కరణ: ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద పార్క్‌లో స్వర్గీయ మండపాక సింహాచలం (డ్రాయింగ్ మాస్టారు) జ్ఞాపకార్థం నిర్మించిన ఐలవ్ ఆత్రేయపురం ఎల్‌ఈడీ లైటింగ్ బోర్డును శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. అనంతరం అల్లూరి సీతరామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. లైటింగ్ బోర్డు ఏర్పాటు చేసిన మాస్టారు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, పీఎస్ రాజు, కరుటూరి నరసింహారావు, చవల జగన్నాథం, క్షత్రియ పెద్దలు పాల్గొన్నారు.

స్కూటీ దహనం ఘటనపై కేసు

ద్రాక్షారామ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో గురువారం స్కూటీ దహనం అయిన సంఘటనపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లపొలంలో సర్పంచ్ కట్టా గోవిందు, అతని మేనల్లుడుకు పిల్లి మణికంఠకు వివాదంలో ఉన్న పొలం సాగుచేసేందుకు ఎవరూ రాకపోవడంతో మణికంఠ తాడిపల్లి గ్రామానికి చెందిన పండు రమేష్‌కు కౌలుకు ఇచ్చాడు. ఇద్దరి మధ్య పరిచయం ఉండటంతో కౌలుకు సాగు చేసేందుకు రమేష్ ఒప్పుకున్నాడు. గతనెల 30న పొలాన్ని మణికంఠ ఉండగా రమేష్ తన భార్యతో కలసి వెళ్లి పొలం దమ్ముచేశాడు. 2న ఆ పొలంలో విత్తనాలు వేసేందుకు తాడిపల్లి గ్రామానికి చెందిన సాదె వెంకన్నతో బైక్‌పై విత్తనాలతో వెళ్లాడు. పొలంలో వెంకన్న పనిచేస్తుండగా కట్టా గోవిందు వచ్చి వెళ్లాడు. మళ్లీ తన కుమారుడు రాజాతో వచ్చాడు. పొలంలో పనిచెయ్యడానికి వీల్లేదని రమేష్‌ను వెళ్లిపొమ్మన్నాడు. దీంతో గోవిందు ఫోన్ చేయడంతో మేడిశెట్టి ఇజ్రాయేల్ అక్కడకు వచ్చాడు. ఈ నేపథ్యంలో రాజా.. రమేష్‌పై రాయి విసరగా కాలికి గాయమైంది. అనంతరం పెట్రోల్ తీసుకువచ్చి వెంకన్న బైక్‌పై పోసి నిప్పు పెట్టాడు. ఈలోపు వెంకన్న అక్కడికి వచ్చాడు. మణికంఠ వచ్చి మోటారు సైకిల్‌పై ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి జాయిన్ చేశాడు. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ వాంగ్మూలం నమోదు చేశారు. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్మోహిని అవతారంలో వేంకటేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రాయవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 45వ దశావతార ఉత్సవాలను పురస్కరించుకుని రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి శుక్రవారం జగన్మోహిని అవతారంలో పూజలందుకున్నారు. భక్త సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా అర్చకులు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు స్వామి వారిని జగన్మోహిని అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా అష్టోత్తర పూజలు, అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు.

పాఠశాలల నిర్వహణపై సమీక్ష

ఆత్రేయపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై హెచ్‌ఎంలు, యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో వరప్రసాద్, ఎం.సాహేబ్ శిక్షణ ఇచ్చారు. యజమాన్య కమిటీ బాధ్యతలు, విధులు, అధికారాలపై వారు శిక్షణ అందించారు.

ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు...

• అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైన క్రీడా విశ్రాంతి భవనం • లక్షల ప్రజాధనం దుర్వినియోగం

కొత్తపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల విశ్రాంతి, ప్రత్యేక అవసరాల కోసం నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోకుండానే అసాంఘిక కార్యకలాపాలకు నిలయమై శిథిల స్థితికి చేరుకుంటోంది. క్రీడలు, యువజన శాఖ ఆధ్వర్యంలో కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 2013లో ప్రారంభించి 2014 జూన్‌నాటికి పూర్తి చేశారు. అప్పట్లో కొన్ని సాంకేతిక కారణాలతో ఇది ప్రారంభానికి నోచుకోలేదు. దీనికి తోడుగా ఇండోర్ స్టేడియం చేపట్టాల్సి ఉందని అప్పట్లో దీన్ని ప్రారంభించలేదు. దీన్ని నిర్మించి 12 ఏళ్లు అయినా ఈ భవనాన్ని గాలికొదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీంతో అక్రమార్కులు కిటికీలు, గుమ్మాలు, ఇనుప గ్రిల్స్, గేట్లను పట్టుకుని వెళ్లిపోయారు. లక్షలు వ్యయంతో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం ప్రభుత్వ భవనానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.


శిథిలమవుతున్న క్రీడా విశ్రాంతి భవనం


ద్రాక్షారామలో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


గంగవరంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ద్రాక్షారామ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. ద్రాక్షారామలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు బీసీ సంఘాల నాయకుడు యాట్ల నాగేశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో వేమూరి రాంబాబు, పీడీఎస్‌యు నాయకులు బి.సిద్దూ, వెంటపల్లి బీమశంకరం తదితరులు నివాళులర్పించారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం: సావిత్రిబాయి పూలే జయంత్రిని పురస్కరించుకుని రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట ఎస్‌ఎంహెచ్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్‌ఎం జి.సోమసుందరం ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు టి.విజయనిర్మల, కె.కనకదుర్గ, ఎల్.శ్రీలక్ష్మి, జి.అనురాధ, ఎండీ పర్వీన్ సుల్తానాలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.గంగవరం: సాయిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళా ఉపాధ్యాయులు పని చేయాలని గంగవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో పూలే జయంతిని జరిపారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు రామలక్ష్మి, ఏ.లక్ష్మి, రేణుక, బేబి, పుష్ప తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీవీ బ్రహ్మానందం, శ్రీధర్, ఏడుకొండలు, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి అరుణ్‌కుమార్, మహిళా సాధికార సెల్ కన్వీనర్ జి.సుమలత ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రపటం, తపాలాబిళ్ల

రాయవరం: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇండుగమెల్లి సౌదాసాగర్ గీసిన సావిత్రిబాయి పూలే చిత్రపటం ఆకట్టుకుంది. ఆయన మాట్లాడుతూ పలు రకాల రంగులతో దీన్ని గీయడంతో పాటు 1998లో తపాలాశాఖ విడుదల చేసిన బిళ్లను గీచి నివాళులర్పించినట్టు తెలిపారు.

కొత్తపేట: సావిత్రిబాయిపూలే జీవితం మహిళలకు ఆదర్శప్రాయమని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఎస్ రాణి, రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక విద్యా బాల మందిర్‌లో విద్యార్థులు సావిత్రిబాయిపూలే జయంతిని జరిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్‌కే అనురాధ, హెచ్‌ఎం నూకపెయ్యి శివరత్నం తదితరులు పాల్గొన్నారు.

మండపేట: సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని వక్తలన్నారు. మండపేటలో బీసీ సంఘం అధ్యక్షుడు మల్లువలస గణపతి సారధ్యంలో శుక్రవారం పట్టణంలోని పెద్దకాల్వ వంతెన వద్ద వున్న సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బీసీ సంఘనేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, వీరమల్లు శ్రీనివాస్, పేంకే గంగాధర్, అల్లక శ్రీనివాస్, పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందిస్తున్న వైద్యుడు వెంకట రమణ

స్టడీ మెటీరియల్ పంపిణీ

కె.గంగవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పదవ తరగతి కీలకమైనదని కాకినాడ సత్యా స్కాన్ అధినేత, వైద్యుడు కాదా వెంకట రమణ అన్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. యూటీఎఫ్ సంఘం తయారు చేసిన పదవ తరగతి మోడల్ ప్రశ్నాపత్రాలను దాతలసాయంతో ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేశారు. మండలంలో 432 మంది విద్యార్థులకు వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ కాదా వెంకట రమణ, ద్రాక్షారామ ఎస్వీ కళాశాల, గంగవరం సౌభాగ్య రైస్‌మిల్లు, వెంకట రమణ రైస్‌మిల్లు ఆర్థికసాయంతో ఈ స్టడీ మెటీరియల్ తయారు చేయించినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మాగాపు ప్రదీప్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.నాగమణి, ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

ఆత్రేయపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా ఉమిడిశెట్టి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. శుక్రవారం ర్యాలిలో నిర్వహించిన బీజేపీ సంస్థాగత ఎన్నికలకు యిళ్ళ సత్యనారాయణ పర్యవేక్షణాధికారిగా అయినవిల్లి సత్తిబాబు, ఉడవల్లి రాంబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా ఉన్న వెంకటేశ్వరరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అల్లు భాస్కరరావు, నడింపల్లి సుబ్బరాజు, శిష్టా సూర్యకుటుంబరావు, చేకూరి రమేష్‌వర్మ, కాలాబత్తుల చిన్నారి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూళ్లలో నేత్రదానం

కె.గంగవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల గ్రామ శివారు నీలగిరిపేటకు చెందిన ఏడిద పుల్లయ్య(70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రదానం చేశారు. కాకినాడకు చెందిన బాదం బాలకృష్ణ ఐబ్యాంకు ప్రతినిధులు పుల్లయ్య నేత్రాలు సేకరించారు. నేత్రదానం చేసి మరో ఇద్దరికి చూపునిచ్చిన పుల్లయ్యను, దీనికి సహకరించిన వారి కుటుంబ సభ్యులు వెంకట రమణ, వెంకట రామకృష్ణ తదితరులను గ్రామస్తులు అభినందించారు.


కొత్తపేటలో మంత్రులు అచ్చెన్నాయుడు, రవీంద్రలకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

మంత్రులకు ఎమ్మెల్యే బండారు ఘన స్వాగతం

కొత్తపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ పర్యటనకు విచ్చేసిన వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రలకు కొత్తపేటలో స్థానిక కాపు కల్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి, ధర్నాల రామకృష్ణ, ముత్యాల బాబ్జి, విళ్ళ వీరమారుతిప్రసాద్, బీర ఇసాక్, వాసంశెట్టి సత్యనారాయణ, సి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించం


రామచంద్రపురంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంత్రి సుభాష్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని కూటమి నాయకులు తెలిపారు. శుక్రవారం రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడిశెట్టి ఇజ్రాయేల్ చేసిన ఆరోపణలను వారు ఖండించారు. పార్టీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్ తదితరులు మాట్లాడుతూ మేడిశెట్టి ఇజ్రాయెల్ తెలుగుదేశం పార్టీ నాయకుడిగా చెప్పుకుంటూ వైసీపీ కోవర్టుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో మంత్రిపై ఆయన దుష్ప్రచారం చేయడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఇజ్రాయెల్ పై కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించాలని తీర్మానం చేసి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ విత్తనాలు వెంకట రమణ, మాజీ సర్పంచ్ సుంకర చినకాపు, కె.గంగవరం, కాజులూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సమగ్రశిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచాలి

కె.గంగవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు తగ్గిపోకుండా పెరిగేలా పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎంపీపీ పంపన నాగమణి, సమగ్రశిక్షా జిల్లా సీఎంవో ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం కె.గంగవరం ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లు, సభ్యులకు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తరచు సమావేశాలు జరగాలని, పాఠశాల యాజమాన్య కమిటీలు హాజరై సూచనలు ఇవ్వాలని ఎంఈవో ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు అన్నారు. ఆర్పీలు ఎం.పుల్లయ్య, పద్మయుగంధర్‌రెడ్డి, నాగేశ్వరరావు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసు, నరాల కృష్ణకుమార్, ఎన్వీ రమణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కనకేశ్వరరావు

కొత్తపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన సంపతి కనకేశ్వరరావు ఎన్నికయ్యారు. బోడిపాలెం సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా శిష్టా కుటుంబరావు, ఎన్నికల పరిశీలకులుగా మోకా వెంకటసుబ్బారావు, పాలాటి మాధవస్వామి అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించగా కనకేశ్వరరావును ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, పాలూరి జయప్రకాష్ నారాయణ, ఇళ్ళ సత్యనారాయణ, ఎ.సత్తిబాబు తదితరులు అభినందించారు.

మద్యం కలిగి ఉన్న ఇద్దరి అరెస్టు

కొత్తపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నరన్న సమాచారం కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో పెదరాము నూతిమెరకకు చెందిన సానబోయిన లక్ష్మి వద్ద 10 మద్యం సీసాలు, బిళ్ళకుర్రు గ్రామానికి చెందిన యాళ్ళ రామాంజనేయులు వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాల భర్తీకి నోటిఫికేషన్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లో చౌకధరల దుకాణాల ఖాళీలు భర్తీకి శుక్రవారం ఆర్డీవో నోటిఫికేషన్ జారీ చేశారు. చౌకధరల దుకాణం డీలరు రాజీనామా, మరణంతో ఏర్పడిన ఖాళీలతో పాటు రేషన్‌కార్డులు సర్దుబాటు కారణంగా ఏర్పడిన 91 చౌకధరల దుకాణాల ఖాళీలు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోలోగా రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది. ఈనెల 19న రాతపరీక్ష 22, 23 తేదీలలో ఇంటర్వ్యూలు, ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 24న నియామక ఉత్తర్వులు జారీ చేస్తామని ఆర్డీవో దేవరకొండ అఖిల ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ వివరాలు, దరఖాస్తులు కావలసిన వారు తహశీల్దార్ కార్యాలయాల్లో లేదా రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గాని పొందవచ్చని ఆమె తెలిపారు.

ద్వారపూడిలో సర్వే ఆఫ్ విలేజెస్ ప్రారంభం

మండపేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన విలేజ్ మాపింగ్ సర్వేలో భాగంగా ద్వారపూడిలో శుక్రవారం సర్వే ప్రారంభమైంది. గ్రామాల్లో ఉండే గృహాలకు సంబంధించి ఇళ్ల స్థలాల సర్వే, సరిహద్దులకు సంబంధించిన సర్వే వివరాలు, మ్యాపింగ్ ప్రారంభమైంది. గ్రామాల్లో గ్రామ కంఠం భూములు భూ యజమాని హక్కులకు సంబంధించి ఆస్తులకు సర్వే నిర్వహించి యజమానులకు ఆస్తి యాజమాన్య పత్రం అందిస్తామని మండల పంచాయతీ విస్తరణాధికారి దాసరి శ్రీనివాసరావు తెలిపారు. ద్వారపూడిలో ప్రారంభమైన సర్వేను ఆయన పంచాయతీ కార్యదర్శి ఆకుల వీ.వీరమణతో కలిసి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో పలు గ్రామాల్లో సర్వే పూర్తయిందని ఇంకా సగం గ్రామాల్లో జరగాల్సి ఉందన్నారు.